కోడ్ ఉన్నా ఆడిందే 'ఆట'నా?

- రాష్ట్రంలో ఈసీ ద్వంద్వ వైఖరి!
- అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కేసీఆర్‌కు అనుమతి నిరాకరణ
- ప్రచార ఎజెండాతో సీఎం ఫుట్‌బాల్
- ఈసీ ప్రేక్షకపాత్రపై నెటిజన్ల ఫైర్

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల సంఘం ద్వంద్వ వైఖరి అనుసరిస్తున్నదని నిపుణులు, నెటిజర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆడిందే 'ఆట'గా నడుస్తుండటమే ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు. దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రామావత్ రవీంద్రకుమార్‌నాయక్ తండ్రి రమావత్ కనీలాల్‌నాయక్ మరణించారు. ఆదివారం దేవరకొండలో జరిగే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావించారు. కానీ, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నదంటూ కలెక్టర్ అనుమతించలేదు. దీంతో కేసీఆర్ పర్యటన రద్దయ్యింది. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫుట్‌బాల్ ఆడారు. ఈ మ్యాచ్ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో జరిగిందని చెప్తున్నారు. మ్యాచ్ మామూలుగా ఆడితే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. ఆ గ్రౌండ్ చుట్టూ బౌండరీ లైన్‌గా కాంగ్రెస్‌ను గుర్తు తెచ్చేలా మూడు రంగుల పరదాను ఐదు అడుగుల ఎత్తు మేర కట్టారు. ఇలా పరదాలు కట్టడం, కాంగ్రెస్ నాయకులు ఆడటం, దానిని వీడియో తీసి విడుదల చేయడం కచ్చితంగా ఎన్నికల ప్రచారమే అన్నది నిపుణుల మాట. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, టిమ్రిస్ ప్రెసిడెంట్ ఫహీంఖురేషి, హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ నాయకులు మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ జట్టుకు కాంగ్రెస్ కూటమి పేరును స్ఫురించేలా 'ఇండియా టీమ్' అని పేరుపెట్టారు. టీషర్టులపై ఆ పేరు రాయడంతోపాటు షర్టు చివర్లోనూ మూడు రంగుల స్ట్రిప్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. మ్యాచ్‌ను చూసేందుకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీం, టీ శాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్‌ను స్ఫురించే జెండాలు కట్టి.. ఆ పార్టీ నాయకులు ఆడిన మ్యాచ్ ఎన్నికల ప్రచారం కాదా? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. చిన్న చిన్న అంశాలకే సుమోటోగా తీసుకొని నోటీసులు ఇచ్చే ఎన్నికల సంఘానికి ఈ తతంగం కనిపించలేదా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా.. సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర నేతలు తరచూ ఫుట్‌బాల్ అడుతుంటారు కాబట్టి ఆదివారం ఆటవిడుపుగా ఆడారనుకొనే అవకాశం కూడా లేదని చెప్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఫుట్‌బాల్ ఆడిన దాఖలాలు లేవని అంటున్నారు.ఎన్నికల సంఘం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఫుట్‌బాల్ ఆడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఈసీ తీరుపై విమర్శలు

ఎన్నికల సంఘం తీరుపై విమర్శలు రావడం ఇదే మొదటిసారి కాదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అనుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై 48 గంటలు ప్రచారం చేయకుండా నిషేధం విధించడాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి పరుష పదజాలం వాడినా, ఎన్ని ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోలేదని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు ఇదే తరహాలో ప్రవర్తిస్తున్నదని పార్టీ సహచరుడి తండ్రి మరణిస్తే మానవీయ కోణంలో పరామర్శించేదుకు వెళ్లే కార్యక్రమాన్ని అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ జెండాలతో ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డిపై ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోడ్ ఉల్లంఘించిన మంత్రి పొన్నం

వేములవాడలో బైక్ ర్యాలీ

వేములవాడ, మే 12 : బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. శనివారం ప్రచార గడువు ముగిసిన ప్పటికీ ఆదివారం వారు వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్తూపం నుంచి జాతర గ్రౌండ్‌లోని ఉడిపి హోటల్ వరకు కాంగ్రెస్, సీపీఐ నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. స్వయంగా మంత్రి పొన్న బైక్ నడుపుతూ హస్తాన్ని చూపుతూ ఉడిపి హోటల్‌కు చేరుకుని టీ తాగారు. తిరుగు ప్రయాణంలో రాజన్న ఆలయం నుంచి బస్టాండ్ వరకు ఆటోలో వచ్చారు. అక్కడి నుంచి సిరిసిల్ల వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మహిళలతో మాట్లాడి మహాలక్ష్మి పథకం అమలుతీరును తెలుసుకున్నారు. కాగా, వేములవాడలో బైక్ ర్యాలీ తీసి హస్తం చూపుతూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన మంత్రిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సిద్దిపేటలో బీజేపీ నేతల నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం

బీజేపీ ఎన్నికల కార్యాలయంలో మద్యం సీజ్

సిద్దిపేట టౌన్, మే 12 : ఎన్నికల కోసం వార్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న బీజేపీ కార్యాలయంలో నిల్వ చేసిన మద్యాన్ని సిద్దిపేట పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు, స్థానికుల వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని 39వ వార్డు గురుకృప కళాశాల వద్ద గల ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక కార్యాలయంలో బీజేపీకి చెందిన నేతలు మద్యం నిల్వ చేసినట్టు సమాచారం రావడంతో పోలీస్ సిబ్బంది తనిఖీలు చేశారు. అందులో 4 కాటన్ల మద్యం లభించగా సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు బీజేపీ నేతలు రత్నం, శ్రీనివాసులు ఈ మద్యాన్ని తీసుకువచ్చినట్టు తెలుస్తున్నదని వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపారు.

చొప్పదండి ఎమ్మెల్యే ప్రలోభం

ఆర్థికసాయం పేరిట మహిళకు 5 వేలు అందజేత

కొడిమ్యాల, మే 12: మరికొన్ని గంటల్లో లోక్‌సభ పోలింగ్ ప్రారంభం కానున్న తరుణంలో కాంగ్రెస్ నేతలు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. రెండు నెలల కిందట ఆపరేషన్ చేయించుకున్న ఓ మహిళకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆర్థిక సాయం పేరిట రూ.5 వేల నగదు అందించడం వివాదాస్పదంగా మారింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం గౌరాపూర్‌కు చెందిన సురుగు రాధ కాలికి ఇన్‌ఫెక్షన్ కాగా, రెండు నెలల కిందట ఆపరేషన్ చేసి కాలు తొలగించారు. అప్పటినుంచి ఇంటివద్దనే ఉంటూ కొలుకుంటున్నది. ఇన్నిరోజులు సాయం చేయని చొప్పదండి ఎమ్మెల్యే హఠాత్తుగా ఆదివారం రాధ ఇంటికి వెళ్లి రూ.5 వేల నగదు అందజేశారు. దీన్ని వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో ఇతర పార్టీల నాయకులు అభ్యంతరం తెలిపారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని, అధికారులు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గడువు ముగిసినా సోషల్ మీడియాలో ప్రచారం

కాంగ్రెస్‌పై ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : ఆదివారం సాయంత్రానికి గడువు ముగిసినా సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నదని బీఆర్ఎస్ తెలిపింది. ఈ మేరకు సీఈవో వికాస్‌రాజ్‌కు బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకురాలు ఎన్ లలితారెడ్డి, పార్టీ నేతలు లక్ష్మణ్, సదానందం కలిసి ఫిర్యాదు చేశారు. ఎక్స్ వేదికగా ప్రచారం చేస్తున్నదని, ఇందుకు సంబంధించిన ఆధారాలను అందజేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, పోస్టర్లు, ఫొటోలతో విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు. లైవ్ టెలికాస్ట్ కూడా నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల నియామవళిని స్పష్టంగా ఉల్లంఘించారని, దీనికి బాధ్యులైన కాంగ్రెస్ పార్టీపై చర్యలు తీసుకోవాలని కోరారు. దేవరకొండ నియోజకవర్గం, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ స్టేషన్‌లలో కాంగ్రెస్ పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడాలని, ఓటర్లను బెదిరించాలని చూస్తున్నారని తమకు సమాచారం అందిందని మరో ఫిర్యాదు చేశారు. ఈ నియోజకవర్గాల్లో పోలీసులను ఎక్కువ మందిని మోహరించి ఎలాంటి రిగ్గింగ్, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్టు లీగల్ సెల్ నాయకురాలు లలితా రెడ్డి మీడియాకు తెలిపారు.

ఆర్టీసీ సంక్రాంతి రికార్డు బ్రేక్

9 నుంచి 11 వరకు 1.42 కోట్ల మంది ప్రయాణం

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : సార్వత్రిక ఎన్నికల వేళ సంక్రాంతి రికార్డును టీఎస్ఆర్టీసీ బ్రేక్ చేసింది. సంక్రాంతి సీజన్‌తో పోలిస్తే 10శాతానికి పైగా ప్రయాణికులు ఆర్టీసీని వినియోగించుకొన్నారని టీఎస్ఆర్టీసీ తెలిపింది. ఈ నెల 9 నుంచి 11 వరకు సుమారు 1.42 కోట్ల మందికిపైగా ప్రయాణించారని వెల్లడించింది. ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్లే వారి కోసం టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఏపీ వైపునకు ఇప్పటివరకు 590 స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయగా.. తాజాగా హైదరాబాద్ విజయవాడ రూట్‌లో 140 సర్వీసులను ఆన్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ కోసం పెట్టింది. ఆయా బస్సుల్లో దాదాపు 3 వేలకుపైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. టికెట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం http://tsrtconline.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టీఎస్ఆర్టీసీ కోరింది. హైదరాబాద్ నుంచి జిల్లాలకు 1500 ప్రత్యేక బస్సులను టీఎస్ఆర్టీసీ నడుపుతున్నది. జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులు బయలుదేరుతున్నాయి.

15 నుంచి సీయూఈటీ యూజీ పరీక్షలు

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర విద్యాసంస్థల్లోని అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ - యూజీ పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ పరీక్షలను పెన్, పేపర్ విధానంలో ఈ నెల 24వ రకు నిర్వహిస్తారు. సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. 380 నగరాల్లో పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేసింది. అభ్యర్థులు ఏ నగరంలో పరీక్ష రాయనున్నరో తెలిపే సిటీ ఇన్ఫర్మేషన్ స్లిప్‌ను ఇప్పటికే విడుదల చేసింది.

19, 20 తేదీల్లో జేఎన్టీయూలో హ్యాకథాన్

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : జేఎన్టీయూ హైదరాబాద్‌లో ఈ నెల 19, 20న హ్యాకథాన్ నిర్వహించనున్నట్టు వర్సిటీ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. హ్యాకథాన్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆదివారం గడువు ముగిసింది. యూనివర్సిటీలో డైరెక్టరేట్ ఆఫ్ ఆంత్రపెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ ఆధ్వర్యంలో హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. హ్యాకథాన్‌లో భాగంగా మొత్తం 50 ఇన్నోవేషన్‌లను ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు.

పొంచి ఉన్న మరో ముప్పు

మొదటిపేజీ తరువాయి...

కీలక అంశాలు తెరమీదికి వచ్చాయి. ఆయా అంశాల తేనెతుట్టెను కదిలిస్తే అసలు పరిష్కరించే అవకాశమేలేనివిగా ఉన్నాయని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండు జాతీయ పార్టీలు వాటిపై తమ వైఖరిని ప్రదర్శించకపోగా అవి ఇచ్చిపుచ్చుకునే ధోరణినే అవలంభించాయని, తెలంగాణ ప్రయోజనాల విషయంలో ఆ రెండు పార్టీల వైఖరి ఒక్కటేనని సామాజికవేత్తలు స్పష్టంచేస్తున్నారు. ఈ క్లిష్ట సమయంలో కాంగ్రెస్, బీజేపీలకు చెక్‌పెట్టకపోతే తెలంగాణలో జరిగే పరిణామాలు ఏ విధంగా ఉండబోతున్నాయో వారు వివరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ హైదరాబాద్. అది కేవలం రాష్ట్ర రాజధాని మాత్రమే కాదు– ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వైభవానికి ప్రతీక. తెలంగాణ ఆర్థిక జీవగడ్డ. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొలిక్కి వస్తున్న దశలో హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసేందుకు జరిగిన బలమైన కుట్రలను తెలంగాణ సమాజం తిప్పికొట్టింది. హైదరాబాద్ లేని తెలంగాణ.. తలలేని మొండెంతో సమానమని తెలంగాణ తిరుగుబాటు చేసిన విషయం తెలిసిందే. ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన తరువాత రెండు సార్లు లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. అప్పుడూలేని వాదన ఈసారి ఎందుకు వచ్చింది? దీనిని తెరపైకి తెచ్చింది ఎవరు? దాని వెనుక ఉన్న మతలబు ఏమిటి? వంటి అంశాలను అర్థం చేసుకొని తెలివైన నిర్ణయం తీసుకోవాలి.

రెండో రాజధాని: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇష్టంలేని వాళ్లు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేయాలని సూచించారని గుర్తుచేస్తూ అనేక రకాల సూత్రీకరణలు చేశారు. ఆ మహనీయుడు రెండో రాజధాని అని ఎందుకు సిఫారసు చేశారు? నాడున్న భౌగోళిక, రాజకీయ పరిస్థితులను రెండో రాజధానికి సహేతుకమైన వివరణలు ఇచ్చి ఆ వాదన ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు సరైంది కాదని తిప్పికొట్టారు. అయినా, పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా తెరపైకి ఎందుకు తెచ్చారు? దీని వెనుక ఉన్న శక్తులకు సహకరిస్తున్నది ఎవరో తెలుసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

మెడపై వేలాడుతున్న ఉమ్మడి రాజధాని కత్తి: 1953లో తమిళనాడు నుంచి వేరుపడ్డ ఆంధ్ర రాష్ట్రానికి కర్నూలులో రాజధాని, గుంటూరులో హైకోర్టు ఉండేవి. రాజధాని సౌకర్యం లేక నానా అవస్థలు పడిన ఆంధ్రరాష్ట్రం కన్ను హైదరాబాద్ మీద పడింది. 1948 నుంచి 1956 వరకు ఉన్న హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా మారడం, ఉమ్మడి రాష్ట్రానికి హైదరాబాద్ రాజధానిగా దాదాపు ఆరు దశాబ్దాలు కొనసాగిన విషయం తెలిసిందే. 2014లో తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించే సందర్భంలో హైదరాబాద్ పదేండ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని సాక్షాత్తు విభజన చట్టంలోనే పొందుపరిచారు. అయితే, విభజన చట్టంలో పేర్కొన్న కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, ఐఐఎం, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, ఎయిమ్స్, ఐఐఎం, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు సహా అనేక అంశాలపై కేంద్రం తెలంగాణకు చట్టబద్ధ పూచీ ఇచ్చినా వాటిని నెరవేర్చలేదు. 2024 జూన్ 2తో పదేండ్ల ఉమ్మడి రాజధాని గడువు ముగుస్తున్నది. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో పదేండ్ల కాలం పూర్తి అవుతున్నా.. అక్కడ రెండు ప్రభుత్వాలు ఏర్పడినా రాజధాని నిర్మించుకోని కారణంగా కేంద్రంలో బీజేపీ లేదా కాంగ్రెస్ సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైతే హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువును పెంచే ప్రమాదం పొంచి ఉన్నది. ఇటువంటి తరుణంలో తెలంగాణ తెలివైన నిర్ణయం తీసుకోవాలి.

ఇచ్చంపల్లి కుట్ర: గోదావరి జలాలను తమిళనాడుకు తరలించే కుట్రకు రెండు పార్టీలు తెరలేపాయి. గోదావరి నదిపై ఇచ్చంపల్లి దగ్గర ప్రాజెక్టు నిర్మించి తరలిస్తామని బీజేపీ బాహాటంగా ప్రచారం చేసింది. బీజేపీ వాదనకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ స్పందించలేదు. కేంద్రంలో పదేండ్లు అధికారాన్ని చెలాయించిన బీజేపీ గోదావరి, కృష్ణానదీ జలాల వాటా తేల్చడంలో పదేండ్లు అంటీముట్టనట్టు వ్యవహరించింది. కాంగ్రెస్ దానికి వంత పాడినట్టుగా వ్యవహరించిందే తప్ప ఏనాడూ వాటా తేల్చాలని కోరలేదు. పైగా ఇటీవలే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా నది జలాలను కేఆర్ఎంబీకి అప్పగించింది. చివరికి అసెంబ్లీ సాక్షిగా ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడానికి ఉద్దేశించిన తీర్మానం చేసింది. ఇటువంటి వాతావరణంలో తెలంగాణ తలరాత నీటిమీద రాత కావద్దు.

స్వీయ రాజకీయ అస్తిత్వం: 'మట్టిపనికైనా ఇంటివాడే కావాలి' అన్నట్టుగా తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ ఢిల్లీ కేంద్రంగా రాజకీయాలు నడిపే పార్టీలకు ఉండదని చరిత్ర నిరూపించిన సత్యం. అరవై ఏండ్లగోసను తీర్చి పదేండ్లు పసిడిరాసులు కురిసిన పల్లెలు ఇవ్వాళ ఎందుకు బెంగటిల్లాయి? తెలంగాణకు ముల్లు గుచ్చుకుంటే పంటితో తీసే పనిమంతుడు కావాలి కానీ, పారిపోయేవాళ్లు కాదనే విషయాన్ని గ్రహించాలి.

ఆగని పగ.. అదే విషం: తల్లిని చంపి బిడ్డను బతికించారని, తలుపులు మూసి అప్రజాస్వామికంగా రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని, అమరవీరుల త్యాగాలను, ప్రజల ఆకాంక్షలను అవమానించింది బీజేపీ. ఆయా సందర్భాల్లో అదే పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ మౌన ప్రేక్షకపాత్ర పోషించింది. ఆరు దశాబ్దాల తెలంగాణ పోరాటాన్ని, నాలుగున్నర కోట్ల ప్రజల తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవహేళన చేసిన సన్నివేశాలు గుర్తుచేసుకొని తెలివైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఇదే.

జిల్లాల పునర్విభజన: జిల్లాల పునర్విభజనతో గడప గడపకూ సర్కారు ఫలాలు అందుతున్నాయి. 'చిన్నకుటుంబం చింతల్లేని కుటుంబం' అన్నట్టుగా భౌగోళికంగా చిన్న జిల్లాలు ఉండటం వల్ల పర్యవేక్షణ పెరిగి ప్రజలకు తక్షణ ప్రయోజనం కలిగింది. తద్వారా ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. రెవెన్యూ డివిజన్ల సంఖ్య పెంపు, నూతన మండలాల ఏర్పాటుతో సంక్షేమ పథకాల అమలు కాలంతోపాటు పోటీ పడింది నిజమా? అబద్ధమా? బేరీజు వేసి నిర్ణయం తీసుకోవాలి.

రైతుబంధు కుదింపు

దశాబ్దాలుగా దగాపడిన రైతును ఒకదరికి తెచ్చేందుకు సాహసోపేతంగా ప్రారంభమైనదే రైతుబంధు. తన కాళ్ల మీద తాను నిలబడేదాకా రైతుకు సర్కారే అండగా ఉండాలన్న ఆకాంక్షతో కేసీఆర్ ప్రవేశపెట్టిన సీలింగ్‌లేని రైతుబంధు పథకం ఇంతాకలం విజయవంతంగా అమలైంది. వ్యవసాయరంగంలో విప్లవాత్మక చర్యగా రైతుబంధును ప్రపంచం కీర్తించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మూలస్థంభంగా ఉండే రైతును ఆదుకునే మానవీయ కార్యక్రమంగా రైతుబంధును ఐక్యరాజ్యసమితి అభివర్ణించింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా వెలువడిన ప్రకటనలు రైతుబంధును ప్రశ్నార్థం చేస్తున్నాయి. 5 ఎకరాల రైతులకే రైతుబంధు అమలు చేస్తామనే తీరుకు తేరుకొని సమాధానం చెప్పాల్సిన తరుణం ఇదే.

బీఆర్ఎస్ నేత ఇంట్లో పోలీసుల హంగామా

- డబ్బు ఉందని తాళం వేసిన ఇంటికి సీల్
- ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్ దవాఖానకు వెళ్లినట్టు చెప్పినా వినని పోలీసులు
- ఇంటికి వచ్చినా సీల్ తీయకుండా రెండున్నర గంటలు తాత్సారం
- చివరికి దొరికింది దేవుని గదిలో రూ.276 విలువైన నాణేలు మాత్రమే
- వెనుదిరిగిన పోలీసులు, ఎన్నికల అధికారులు

సిద్దిపేట, మే 12: ఇంట్లో డబ్బులు దాచారని ఫిర్యాదు రావడంతో పోలీసులు బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు, దళిత నాయకుడు జువ్వన్న కనకరాజు నివాసాన్ని ఆదివారం సీజ్ చేశారు. సిద్దిపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల అంబేద్కర్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కనకరాజు ఇంట్లో డబ్బులు నిల్వ చేశారనే సమాచారంతో పోలీసులు ఆయన ఇంటికి వచ్చారు. అప్పటికే కనకరాజు తన భార్య అనారోగ్యంతో ఉండటంతో చికిత్స నిమిత్తం ఇంటికి తాళం వేసి ఆమెను హైదరాబాద్ యశోద దవాఖానకు తీసుకెళ్లాడు. ఈ విషయమై పోలీసులు కనకరాజును సంప్రదించగా, తన భార్య అనారోగ్యంతో ఉండటంతో తాను హైదరాబాద్ వచ్చానని, అధికారులకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని చెప్పారు. అయినా పోలీసులు ఇంటిని సీజ్ చేసి పోలీస్ పహారా ఏర్పాటు చేశారు.

రెండు గంటలపాటు హైడ్రామా

కనకరాజు తన కుటుంబ సభ్యులతో మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంటికి చేరుకున్నాయి. ఇంటికి వేసిన సీల్ తీయాలని పోలీసులు వేడుకున్నా సాయంత్రం 5.45 వరకు వారిని బయటే వేచి ఉండేలా చేశారు. అతని భార్య అనారోగ్యంతో ఉన్నా పోలీసులు కనికరించలేదు. బీఆర్ఎస్ కార్యకర్తలు, స్థానికులు భారీగా చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్నది. సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ సాయంత్రం అక్కడికి వచ్చి ఇంటికి వేసిన సీల్‌ను తొలగించారు. ఏసీపీ మధుతోపాటు ఎన్నికల అధికారులు, పోలీసులు మీడియా సమక్షంలో కనకరాజు ఇంటిని పూర్తిగా తనిఖీ చేశారు. ఇంట్లోని దేవుని గదిలో రూ.276 మాత్రమే లభించాయి. అంతకుమించి ఏమి దొరక్క పోవడంతో పోలీసులు వెనుదిరిగి వెళ్లారు.

పోలీసుల తనిఖీలో దొరికింది ఈ చిల్లరే..

- **సోషల్ మీడియా రూమర్లపై నజర్**

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు డీజీపీ రవిగుప్తా వెల్లడించారు. ఆదివారం ఆయన మీడియాతో పలు విషయాలను వెల్లడించారు. నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేకంగా కొందరు సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిబ్బందిని కేటాయించినట్టు చెప్పారు. కొన్ని వివాదాస్పద సోషల్ మీడియా ఖాతాలను సైబర్ సెక్యూరిటీ సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పార్టీలను, నేతలను కించపర్చేలా పోస్టులు, మార్ఫింగ్ వీడియోలు, ఆడియోలు పెట్టే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. సీ విజిల్ నుంచి వచ్చే ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు సైబర్ పోలీసులు పరిష్కరిస్తున్నారని తెలిపారు.

350 అతి సున్నితమైన ప్రదేశాల గుర్తింపు

తెలంగాణలోని 17 ఎంపీ స్థానాల పరిధిలో 350కి పైగా అతి సున్నితమైన ప్రదేశాలను గుర్తించామని డీజీపీ రవిగుప్తా తెలిపారు. మావోస్టులు ప్రభావం అత్యధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోనే ఇవి ఎక్కువగా ఉన్నాయని, ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జిల్లాలతోపాటు, రాష్ట్ర సరిహద్దుల్లో ఇప్పటికే పారా మిలటరీ బలగాలు మోహరించాయని తెలిపారు. మావోయిస్టు ప్రాంతాల్లో రోడ్ ఓపెనింగ్, ఏరియా డామినేషన్స్, కూంబింగ్ ఆపరేషన్స్ విస్తృతంగా జరుగుతున్నాయని వెల్లడించారు. పాత బస్తీలోని సున్నిత ప్రాంతాలనను సీసీ కెమెరాలతో నిత్యం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 9,130కి పైగా కేసులు నమోదు చేశామని, రూ.190 కోట్లకు పైగా నగదు సీజ్ చేశామని డీజీపీ తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా లక్ష మందికి పైగా సిబ్బంది బందోబస్తులో ఉన్నారని తెలిపారు. తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి అదనపు బలగాలను రంగంలోకి దింపామని వివరించారు.

- **కారులో తరలిస్తున్న 99.94 లక్షలు స్వాధీనం**

కూసుమంచి, మే 12: ఎన్నికల వేళ సరైన పత్రాలు లేకుండా రవాణా చేస్తున్న రూ.99.94 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. హైవే మీదుగా కాకుండా సూర్యాపేట నుంచి నాయకన్‌గూడెం మీదుగా ఖమ్మం వస్తున్న ఇన్నోవా వాహనాన్ని నాయకన్‌గూడెం వద్ద పోలీసులు ఆపారు. ఆ వాహనం ఆగకుండా వెళ్లడంతో పో